క్లుప్తంగా

మట్టి వినాయకులను పూజిద్దాం..

రామగిరి: పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలనే పూజిద్దామని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం సెంటనరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో కాలనీ వాసులకు సేవాసమితి అధ్యక్షురాలు ఎస్.అలివేణితో కలిసి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

ధర్మారం: ఆదివారం లయన్స్‌ క్లబ్, సాయి మణికంఠ హైస్కూల్‌ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను భక్తులకు పంపిణీ చేశారు.

విశ్వేశ్వరాలయంలో పూజలు

రామగుండం: అబాది రామగుండంలోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం శివుడికి విశిష్ట పూజలు నిర్వహించారు. పలువురు దాతలు శివలింగానికి వెండి తొడుగు, వెండి పానవట్టం అందజేయగా.. ఆలయ పూజారులు వేద మంత్రోచ్ఛరణాల మధ్య ప్రతిష్ఠించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పెద్దపల్లిరూరల్: తుర్కలమద్దికుంట గ్రామంలో శ్రీమల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రైస్‌మిల్‌ యజమాని వాజీద్‌ రూ.20వేలు విరాళంగా అందించాడు.

మైక్‌ సెట్‌ అందజేత

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కట్ట మైసమ్మ ఆలయానికి సుభాష్‌నగర్‌కు చెందిన వునుకొండ మహేశ్‌ మైక్‌ సెట్‌ను ఆదివారం బహూకరించారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

పాలకుర్తి: గణపతి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్‌ ఉన్‌ నబి పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్‌ పిలుపునిచ్చారు. ఆదివారం బసంత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

కాల్వశ్రీరాంపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఎస్సై వెంకటేశ్‌ ప్రజలను కోరారు. ఇటీవల బదిలీపై కాల్వశ్రీరాంపూర్‌ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పాఠశాల గదులు కూల్చివేత

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్‌ అల్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న రెండు గదులను ఆదివారం డివిజన్‌ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్‌ జిల్లా వైస్‌ ప్రెసిడెంట్‌ మారెల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో కూల్చివేశారు.

సెక్యూరిటీ గార్డుకు సన్మానం

గోదావరిఖని: సంస్థ ఆస్తుల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన ప్రయివేట్‌ సెక్యూరిటీ గార్డు వాంకుడోత్‌ రమేశ్‌ను ఆదివారం ఆర్జీ–2 సీనియర్‌ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌ అభినందించారు. జీఎం కార్యాలయంలోని సెక్యూరిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి నగదు బహుమతితోపాటు రెయిన్‌ కోట్‌ బహూకరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జ్యోతినగర్: రామగుండం బి–థర్మల్‌ పవర్‌ స్టేషన్‌ ఆవరణలో కొత్తగా 800 మెగావాట్ల విద్యుత్‌ ప్లాంటు నెలకొల్పేందుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ చిత్రపటాలకు కాంగ్రెస్‌ శ్రేణులు క్షీరాభిషేకం చేశాయి.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఇనుముల సతీశ్‌

మంథని: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ తొలిసారిగా ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్‌ క్వార్టర్‌కు వచ్చిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్‌ అధికార ప్రతినిధి, న్యాయవాది ఇనుముల సతీశ్‌ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సుల్తానాబాద్: కాంగ్రెస్‌ ప్రభుత్వం నామినేటెడ్‌ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

కార్యదర్శులతో సమావేశం

రామగుండం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు తదితర అంశాలపై ఆదివారం అంతర్గాం మండల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఎంఏ అలీం అత్యవసర సమావేశం నిర్వహించారు.

కూలిన ఇళ్ల పరిశీలన

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వారం క్రితం కురిసిన వర్షాలకు కూలిన ఇళ్లను ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పెద్దాపూర్‌లో మామిడిపెల్లి కాంతయ్య, జూలపల్లిలో ఉప్పుల రాయనర్సు ఇంటి యజమానులకు ధైర్యం చెప్పి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారమిప్పించేందుకు తమవంతు సహకారముంటుందన్నారు.



గోదావరిఖనిటౌన్: మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌



సుల్తానాబాద్‌లోని గణేశ్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు



పాలకుర్తి: అన్నదాన కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకుడు కౌశికహరి దంపతులు



ఓదెల: కొలనూర్‌ రెండో వార్డులో పూజలు చేస్తున్న భక్తులు

దండాలయ్యా.. ఉండ్రాల్లయ్యా..

వినాయక చవితి వేడుకలను శనివారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, యువత నృత్యాలు, చిన్నారుల కేరింతల మధ్య విగ్రహాలను మండపాలకు తరలించడంతో రోడ్లన్నీ సందడిగా మారాయి. మండపాల్లో గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్‌



యైటింక్లయిన్‌కాలనీ: సరస్వతి పూజలో పాల్గొన్న భక్తులు



సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలో..



ఎలిగేడు: ధూళికట్టలో..



కాల్వశ్రీరాంపూర్‌లో..



ఫర్టిలైజర్‌సిటీ: లక్ష్మీపురం కొత్త గేట్‌లో..



జూలపల్లిలో..



పెద్దపల్లిరూరల్: తెనుగువాడలో గద్దె గణపతి



రామగిరి: సెంటినరీకాలనీలో..



జ్యోతినగర్: పూజలందుకుంటున్న హిందూ వాహని వినాయకుడు



కమాన్‌పూర్: గుండారంలో..

గోపాల్‌నగర్‌ వాసులకు గోసగోస

- ఇళ్ల ఎదుట డ్రైనేజీ ప్రవహిస్తున్న వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత ప్రాంతమైన రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌ కాలనీ 19వ డివిజన్‌ పరిధి గోపాల్‌నగర్‌ ఏరియాలో డ్రైనేజీ నీరు ఇళ్ల ముందు నుంచి ప్రవహిస్తోంది. గోపాల్‌నగర్‌ వాసులు డ్రైనేజీ నీటితో ఇబ్బందులు పడుతున్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని సింగరేణి శ్రీలంక షిర్కె క్వార్టర్స్‌ ఏరియా, సంతోష్‌నగర్, హనుమాన్‌నగర్‌ అల్లూరు తదితర ఏరియాల నుంచి వస్తున్న సింగరేణి డ్రైనేజీతోపాటు మున్సిపల్‌ డ్రైనేజీతో కలిసి ప్రధాన డ్రైనేజీ కాలువలో కలుస్తూ పెట్రోల్‌ బంకు వరకు ప్రవహిస్తూ.. అక్కడి నుంచి గోపాల్‌నగర్‌ ఏరియాలో నివాసముంటున్న ప్రజల ఇళ్ల ముందు నుంచి ప్రవహిస్తూ వాగులో కలుస్తోంది. నివాస ప్రాంతాలు కావడంతో దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలంలో వర్షం, వరద నీరు డ్రైనేజీ నీటిలో కలిసి పొంగిపొర్లడంతో ఇళ్లలోకి వస్తున్నాయని అంటున్నారు.



ఇళ్లను ఆనుకొని ప్రవహిస్తున్న మురుగు నీరు

ప్రస్తుత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు గత నెలలో వచ్చి చూసి డ్రైనేజీ నిర్మించేలా సింగరేణి అధికారులకు చెప్పి సమస్యలు లేకుండా చూస్తామని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోతున్నారు.

బాధ్యత ఎవరిది..

ఆర్జీ–2 ఏరియా సింగరేణి ప్రభావిత ప్రాంతమయినా గోపాల్‌నగర్‌ రామగుండం మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో కూడా ఉండడంతో ఎవరూ పట్టించుకోవడం లేదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైనేజీ నిర్మాణ బాధ్యత సింగరేణి యజమాన్యం లేదా రామగుండం మున్సిపల్‌ అధికారులు ఎవరు తీసుకొని డ్రైనేజీ నిర్మిస్తారనే సందిగ్ధంలో గోపాల్‌నగర్‌ వాసులున్నారు.

భరించలేని దుర్వాసన



మా ఇళ్ల ముందు డ్రైనేజీ కాలువ లేక నీరు ఇళ్ల పక్కనుంచే పోతంది. దుర్వాసన భరించలేకపోతున్నం. చాలా మంది రోగాల బారిన పడ్డరు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించాలె.

– గొడుగు లక్ష్మి, గోపాల్‌నగర్‌ వాసి

పట్టించుకుంటలేరు



కొన్నేళ్ల నుంచి డ్రైనేజీ నీటితో మా ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. ఏ పార్టీ నాయకులు కూడా పట్టించుకుంటలేరు. సింగరేణి, మున్సిపల్‌ అధికారులు డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టాలె.

– గోడిశాల సంపత్, గోపాల్‌నగర్‌ వాసి

రైల్వే ప్రయాణికుడికి తీవ్ర గాయాలు

రామగుండం: ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి రైల్వే ప్లాట్‌ఫారం వద్ద తీవ్ర గాయాలైన ఘటన శనివారం రాఘవపురంలో చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్‌ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్‌ వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా నగరానికి చెందిన సహిత్‌ చెన్నైలో ఉపాధి పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో స్వగ్రామానికి వచ్చే క్రమంలో చెన్నైలో శుక్రవారం త్రివేండ్రం సూపర్‌ఫాస్ట్‌ రైలు ఎక్కి ఫుట్‌బోర్డుపై కూర్చున్నాడు. శనివారం మధ్యాహ్నం రాఘవపురం రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోగా కుడి కాలుకు ప్లాట్‌ఫారం బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన సహిత్‌కు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



వివరాలు నమోదు చేసుకుంటున్న ఆర్‌పీఎఫ్‌ సిబ్బంది

ఫొటో ఒక మధుర జ్ఞాపకం



సుల్తానాబాద్‌రూరల్: ఫొటో ఒక మధుర జ్ఞాపకమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నర్సయ్యపల్లిలోని విజయ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం జిల్లా ఫొటోగ్రాఫర్ల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు.

బియ్యం అందజేత

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌ రెండో డివిజన్‌ న్యూపీకేరామయ్యకాలనీలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన రాంచందర్‌ కుటుంబానికి పసుల ప్రకాశ్‌ 50 కిలోల బియ్యం అందించారు.

షీ టీంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ మల్లన్న

పాలకుర్తి: పుట్నూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ఆదివారం షీ టీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీం ఇన్‌చార్జి ఏఎస్‌ఐ మల్లన్న మహిళల భద్రత, ఆన్‌లైన్‌ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. షీ టీం సిబ్బంది స్నేహలత, సురేశ్, హాస్టల్‌ ఎస్‌వో స్వరూప పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి రూ.లక్ష సాయం

పెద్దపల్లిరూరల్: పెద్దకల్వలకు చెందిన గద్దల వేణుకుమార్‌ అనే జర్నలిస్టు గతేడాది అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం హైదరాబాద్‌ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రెస్‌ అకాడమీ తరఫున రూ.లక్ష విలువైన చెక్కును మృతుడి భార్య స్వప్నకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ శ్రీనివాసరెడ్డి అందజేశారు.

ధర్మారం: కొత్తూరు గ్రామానికి చెందిన నిరుపేద మిత్రుడు మెతుకు సత్యం మరణించగా.. 1996–97 పదోతరగతి మిత్రులు ఆదివారం వారి కుటుంబానికి రూ.16,000 నగదు అందించారు.

కమాన్‌పూర్: పేరపల్లి గ్రామానికి చెందిన రావుల ప్రవీణ్‌ కుటుంబానికి మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్‌ హ్యాండ్స్‌ ఆధ్వర్యంలో సేకరించిన రూ.60వేలను అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిన సోమారపు అనుచరులు

గోదావరిఖని: మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అనుచరులు ఆదివారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. అజీమ్‌తోపాటు మరో 50 మంది పార్టీలో చేరగా.. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌ కండువా కప్పి ఆహ్వానించారు.

బీజేపీలో చేరిక

ఎలిగేడు: మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్‌ గ్రామానికి చెందిన ముదిరాజ్‌ మండల ప్రధాన కార్యదర్శి కీర్తి లింగమూర్తి ఆదివారం బీఎస్పీ నుంచి బీజేపీలో చేరారు.



సుల్తానాబాద్: సుల్తానాబాద్‌ నుంచి ఎలిగేడు మధ్యలో వెళ్లే రహదారి మధ్యలో గుంత ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. గుంతను పూడ్చాలని, రాత్రివేళలో వాహనదారులు గుంతలో పడి తీవ్ర గాయాలపాలవుతున్నారన్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శోభాశంకర్, సుల్తానాబాద్‌ కమిషనర్, సెల్‌ నం.: 6309532229

వాట్సప్‌ చేయండి..

మా ఫోన్‌ నంబర్ : 94403 81258

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

హైడ్రా భేష్‌: గుజ్జుల

పెద్దపల్లిరూరల్: చెరువులు, కుంటలను కబ్జాదారుల చెర నుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైడ్రా అమలును అభినందిస్తున్నామని బీజేపీ జాతీయ కౌన్సిల్‌ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు అధికారంలో ఉన్న పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల మాటలకే విలువనిస్తూ వారి సేవకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. ప్రతి పోలింగ్‌ బూత్‌లో కనీసం 200కు తగ్గకుండా సభ్యత్వ నమోదు చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చూపుదామని అన్నారు. మీస అర్జున్‌రావు, ఠాకూర్‌ రాంసింగ్, కన్నం అంజయ్య, ఓదెలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న గుజ్జుల

నేత్రదానంపై అపోహ వద్దు

కోల్‌సిటీ: అపోహలు, మూఢనమ్మకాలు వీడి మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్‌ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్‌ వాసు, పట్టణ కార్యదర్శి బోల్ల చంద్రశేఖర్‌ పిలుపునిచ్చారు. గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీకి చెందిన తోట పోచమ్మ అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు పోచమ్మ నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం వారి నివాసంలో సదాశయ, రామగుండం లయన్స్‌ క్లబ్‌ సంయుక్తంగా సంస్మరణ సభను నిర్వహించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న నల్లవెల్లి కనకయ్య ఇటీవల మృతిచెందాడు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆదివారం సదాశయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు.

గూడు కట్టిస్తానని హామీ

ఓదెల: శనివారం రాత్రి పొత్కపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గూడెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఎస్సై అశోక్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహ్మద్‌ ఖాజామియా అనే వ్యక్తి గుడిసెలో నివసిస్తున్నాడని, ఇల్లు కట్టివ్వాలని కోరారు. ఖాజామియాకు ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు.



ఖాజామియాకు ఇల్లు కట్టిస్తానని మాట ఇస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

దళితబంధు నిధులు విడుదల చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సాధన సమితి

మంథని: దళితబంధు రెండో విడత నిధులు వెంటనే విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోయిల మహేశ్‌ కోరారు. ఆదివారం మంథనిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ సమీపంలో సమావేశమయ్యారు. అనంతరం ప్లకార్డులు చేతబూని అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్రంలో లక్షా32వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో రూ.17.600కోట్లు జమ చేశారన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రూ.12లక్షలు దళితులకు అందిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఓబీసీ మోర్చా జిల్లా సహ ప్రముఖ్‌గా సదయ్య

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌ మున్సిపాలిటీ సుగ్లాంపల్లికి చెందిన బీజేపీ సీనియర్‌ నాయకుడు చిట్టవేణి సదయ్య ఓబీసీ మోర్చా జిల్లా సహ ప్రముఖ్‌గా ఎన్నికయ్యారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా భూమయ్య

గోదావరిఖని: జనగామ గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడిగా గుండెబోయిన భూమయ్యను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గుండెబోయిన రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా గుండెబోయిన పెద్ద భూమయ్య, కోశాధికారిగా గుండెబోయిన సదానందం, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా చెలుకల రాంమూర్తి, ముఖ్య సలహాదారుగా ఆర్కుటి శంకర్, సంయుక్త కార్యదర్శిగా గుండెబోయిన సంతోష్‌ తదితరులను ఎన్నుకున్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం

కాల్వశ్రీరాంపూర్: పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌ అన్నారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య అధ్యక్షతన కాంగ్రెస్‌ కార్యకర్తల సమావేశం శనివారం కాల్వశ్రీరాంపూర్‌లో నిర్వహించారు.

సుల్తానాబాద్‌ నాయబ్‌ తహసీల్దార్‌గా రాకేశ్‌



సుల్తానాబాద్: సుల్తానాబాద్‌ నాయబ్‌ తహసీల్దార్‌గా రాకేశ్‌ బాధ్యతలు స్వీకరించారు. రామగిరి నుంచి రాగా.. ఇక్కడ పని చేస్తున్న అబుబాకర్‌ తహసీల్దార్‌గా సిరిసిల్లకు వెళ్లారు.

జాతీయ ఫుట్‌బాల్‌ పోటీలకు ఎంపిక



దియా

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన మన్నా దియా జాతీయ సబ్‌ జూనియర్‌ ఫుట్‌బాల్‌ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతి, ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్య, కార్యనిర్వహణ కార్యదర్శి విజయ్‌ తెలిపారు.